



19 వ వసంతంలోకి ...

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

శుక్రవారం 13 మార్చి 2026 పేజీలు 8




# నేడు అన్నదాత సుఖీభవ


**పీఎం కిసాన్ నిధుల విడుదల**

**జిల్లాలో అన్నదాతల ఖాతాల్లో రూ. 67.69 కోట్లు జమ**

**పథకం నిధులను సద్వినియోగం చేసుకోవాలి** 2

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**





# నేడు సీఎం పర్యటన

## ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి

### కృష్ణాజిల్లా అధికారులకు సంయుక్త కలెక్టర్ నవీన్ ఆదేశాలు

**గన్నవరం, మార్చి 12, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు సమన్వయంతో పకడ్బందీగా పూర్తి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంయుక్త కలెక్టర్ ఎం. నవీన్ జిల్లా అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి కృష్ణాజిల్లా గన్నవరం మండలం సూరంపల్లి గ్రామం మాదాలవారిగూడెంలో నిర్వహించనున్న మూడో విడత పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సంయుక్త కలెక్టర్, సూక్ష్మ నీటి సేద్యం పథకం రాష్ట్ర అదనపు సంచాలకులు ఎం. వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉద్యాన శాఖ అదనపు సంచాలకులు సి.బి. హరినాథ్ రెడ్డిలతో కలిసి జిల్లా అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం జెసిబి ద్వారా భూమి చదును చేసే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చేపట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి రైతులతో ముఖాముఖి మాట్లాడే కార్యక్రమం కోసం రైతుల జాబితాను ముందుగానే మిగతా 2లో...



# సీఎం ఏర్పాట్లను ముమ్మరం

**• ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ**

**గన్నవరం, మార్చి 12, మేజర్ న్యూస్ :** గన్నవరం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ఏర్పాట్లను ముమ్మరం చేశారు. శుక్రవారం సూరంపల్లిమాదాలవారిగూడెం సరిహద్దులో నిర్వహించనున్న 'పీఎం కిసాన్ అన్నదాత



# ప్రభు దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలి

**పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని)**

మిగతా 2లో

**(విజయవాడ సెంట్రల్, మార్చి 12, మేజర్ న్యూస్)** ప్రభువైన ఏసు క్రీస్తు దీవెనలు ప్రతి ఒకరిపై ఉండాలని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని ) అన్నారు. సెంట్రల్ నియోజకవర్గం అజిత్ సింగ్ నగర్‌లోని మాకినేని బసవ పున్నయ్య మున్సిపల్ స్టేడియంలో కల్వరి టెంపుల్ ( విజయవాడ) వారి ఆధ్వర్యంలో జరుగుతున్న ఆత్మీయ, ఆర్థిక అభివృద్ధి పండుగల సభా కార్యక్రమంలో ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు బోండా ఉమా మహేశ్వరరావు తనయులు బొండా రవితేజతో కలసి ఎంపీ కేశినేని చిన్ని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో దైవజనులు పి. సతీష్ కుమార్ పాల్గొని దైవ సందేశాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని ) మాట్లాడుతూ శుభ కరమైన షలోమ్ అనే మాట కల్వరి టెంపుల్‌లో ప్రతి ఒక్కరి నోట వినిపిస్తుందన్నారు. ఇంటర్ నేషనల్ పాస్టర్స్ అసోసియేషన్ కార్యదర్శిగా, 2

(మొదటిపేజీ తరువాయి)

## సీఎం ఏర్పాట్లను ముమ్మరం

సుఖీభవ' మూడవ విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆయన, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ముందుగా గన్నవరం నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ కృష్ణ జిల్లా అధ్యక్షులు వీరికి వెంకట గురుమూర్తి తో కలిసి అన్ని మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ఈ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి పార్టీ శ్రేణులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సభకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం కొండపావులూరులోని ఎన్డీఆర్ఎఫ్ కేంద్రానికి వెళ్లిన ఎమ్మెల్యే యార్లగడ్డ అక్కడ ముఖ్యమంత్రి ల్యాండింగ్ కోసం సిద్ధం చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించారు. భద్రతా పరంగా ఎటువంటి చిన్న పొరపాట్లు జరగకూడదని, పోలీసు, రెవెన్యూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సాఫీగా సాగేలా హెలిప్యాడ్ వద్ద అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రోటోకాల్ విషయంలో జాగ్రత్తలు వహించాలని ఆయన స్పష్టం చేశారు.

## వేసవి తాపాన్ని ఎదుర్కొనేందుకు చలివేంద్రాలు ప్రారంభం



**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** 36వ డివిజన్ హనుమాన్‌పేటలోని ఏలూరు లాకులు సెంటర్ వద్ద, పాత గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రం కేంద్రాలను గురువారం ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ప్రారంభించి, పాదచారులు, కార్మికులు, వాహనదారులకు మజ్జిగను పంపిణీ చేసి వారి దాహార్తి తీర్చారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ:- ప్రతిరోజూ పెరుగుతున్న వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు చల్లని నీరు, మజ్జిగ వంటి శీతల పానీయాలు అందుబాటులో ఉండేలా చలివేంద్రాలను ఏర్పాటు చేయడం చాలా అవసరమని ఈ సందర్భంగా బొండా ఉమా పేర్కొన్నారు. ముఖ్యంగా రహదారులపై ప్రయాణించే పాదచారులు, కూలీలు, ఆటో డ్రైవర్లు, కార్మికులు, రోజువారీ పనుల కోసం బయట తిరిగే ప్రజలకు ఈ చలివేంద్రాలు ఎంతో ఉపశమనం కలిగిస్తాయని అన్నారు. సెంట్రల్ నియోజకవర్గం మొత్తం పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రజలకు ఇబ్బంది లేకుండా సుమారు 100కు పైగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ, చల్లటి మంచినీరు నిరంతరం అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటుంటామని తెలిపారు. వేసవి కాలం మొత్తం ప్రజలకు ఉపయోగపడేలా ఈ చలివేంద్రాలు కొనసాగుతాయని అన్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అత్యవసరమైన పని ఉంటే తప్ప బయటకు రావద్దని, వృద్ధులు, చిన్నపిల్లలను ఎండకు గురి కాకుండా చల్లటి వాతావరణంలో ఉంచాలని అన్నారు. మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మరసం వంటి శీతల పానీయాలను తరచూ తీసుకోవడం వల్ల శరీరానికి చల్లదనం కలిగి వడదెబ్బలు తగలకుండా కాపాడుకోవచ్చని అన్నారు. ప్రభుత్వం, ఎన్డీఏ కూటమి నాయకుల ఆధ్వర్యంలో వేసవి కాలంలో ప్రజలకు ఉపశమనం కలిగించేలా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ముఖ్యంగా రహదారుల వెంట చలివేంద్రాలు ఏర్పాటు చేసి పాదచారులు, వాహనదారులకు చల్లటి మంచినీరు, మజ్జిగ వంటి పానీయాలను ఉచితంగా అందజేస్తున్నామని, ప్రజలు కూడా ఈ కార్యక్రమాలను ఉపయోగించుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, సమాజ సేవలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో 36వ డివిజన్ ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నేడు సీఎం పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

ఖరారు చేయాలని చెప్పారు. ప్రజా వేదికను ముఖ్యమంత్రి కార్యాలయ బృందంతో సమన్వయం చేసుకొని సిద్ధం చేయాలని ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశాలు, ప్రధాన వేదిక, ప్రజా వేదిక ప్రాంతాలు, ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గంలో రహదారులు ఎగుడు దిగుడు లేకుండా భూమిని చదును చేయించాలని, అవసరమైన చోట్ల రాంపులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ముళ్లపొదలు తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలు, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మంచినీరు, మజ్జిగ, అల్పాహారం అందించడంతో పాటు సంచార మరుగు దొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలకు అందించే ఆహార పదార్థాలను ముందుగానే తనిఖీ చేయాలని చెప్పారు. ఎన్డీఆర్ఎఫ్ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ వద్ద, రైతులతో ముఖాముఖి ప్రదేశం వద్ద, ప్రజా వేదిక వద్ద ప్రదర్శనశాలలు, గ్రీన్ రూమ్ ప్రాంతాల్లో అంతర్గాల సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గం, వేదిక ప్రాంతాల్లో అవసరమైన చోట్ల బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. రాత్రి సమయంలో కార్యక్రమం జరగనున్నందున విద్యుత్ దీపాలు సమృద్ధిగా ఏర్పాటు చేసి నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని చెప్పారు. కార్యక్రమ ప్రదేశం, మార్గాల్లో చెత్తాచెదారం లేకుండా పారిశుధ్య నిర్వహణ చేయాలని, అవసరమైన చోట్ల సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అగ్నిప్రమాదాలు నివారించేందుకు అగ్నిమాపక యంత్రాలు, వాహనాలు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. చెట్ల మధ్య కార్యక్రమం జరుగుతున్నందున పాములు పట్టే సిబ్బందిని సిద్ధంగా ఉంచడంతో పాటు తేనెతుట్టెలను తొలగించాలని సూచించారు. ముఖ్యమంత్రి రాకముందే మూడు గంటలకల్లా రైతులు ప్రజా వేదికకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయం, ఆక్వా కల్చర్, పశుసంవర్ధకం, ఉద్యాన శాఖల ప్రదర్శనశాలలు ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమానికి వచ్చే ప్రజల నుంచి అర్జీలు స్వీకరించేందుకు "మీకోసం" కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం సంయుక్త కలెక్టర్ జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు,



భద్రతాధికారులు కృష్ణారావు, శాంతికుమార్‌లతో కలిసి వేదిక, ప్రజా వేదిక, రైతుల ముఖాముఖి ప్రాంతాలను పరిశీలించారు. ఈ పర్యటనలో అదనపు ఎస్పీలు వి.వి. నాయుడు, సత్యనారాయణ, రాష్ట్ర ఉద్యాన శాఖ సంయుక్త జేడీ పుల్లారెడ్డి, విజిలెన్స్ అధికారి పోతురాజు, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, డిపిఓ డాక్టర్ జె. అరుణ, డీఎస్ఓ మోహన్ బాబు, డిఎంహెచ్వో డాక్టర్ యుగంధర్, డ్వామా పీడీ శివప్రసాద్, ఉద్యాన అధికారి జే. జ్యోతి, జిల్లా పశు సంవర్ధక అధికారి చిన్న నరసింహులు, జిల్లా అగ్నిమాపక అధికారి ఏసురత్నం, మత్స్యశాఖ అధికారులు లాల్ మొహమ్మద్, అయ్యా నాగరాజా, ఎన్టీఆర్ వైద్య సేవల ట్రస్ట్ డీసీ డాక్టర్ సతీష్, డిప్యూటీ సీఈఓ కన్నమ నాయుడు, ఆనంద్ కుమార్ సోమశేఖర్, పంచాయతీరాజ్ ఎస్ఈ రమణరావు, మెప్మా పీడీ సాయిబాబు, మార్కెటింగ్ ఏడీ నిత్యానందం, డీసీఓ చంద్రశేఖర్, మార్క్‌ఫెడ్ డీఎం మురళి కిషోర్, ఎన్ఐసి అధికారి ఫణికుమార్, డీఎస్పీ శ్రీనివాసరావు, గన్నవరం తహసీల్దార్ శివయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

# నేడు అన్నదాత సుఖీభవ

**ఎన్టీఆర్ జిల్లా, మార్చి 12, మేజర్ న్యూస్ :** అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలుచేస్తున్న అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద మూడో విడతలో అర్హులైన ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూర్చడం జరుగుతుందని.. జిల్లాలో ఈ పథకం మూడో విడత కింద ఈ నెల 13న రూ. 67.69 కోట్లు లబ్ధిచేకూరుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద ఇప్పుడు మూడో విడతలో 1,18,629 మంది లబ్ధిదారులకు రూ. 4 వేలు చొప్పున రూ. 47.45 కోట్లు లబ్ధి జరుగుతుందని.. అదేవిధంగా పీఎం కిసాన్ కింద 1,01,200 మంది లబ్ధిదారులకు రూ. 2 వేలు చొప్పున రూ. 20.24 కోట్లు జమవు తుందని వివరించారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు అందుతున్న ఆర్థిక సహాయం.. రైతుల ఆర్థిక స్థిరత్వానికి, వ్యవసాయ రంగ బలోపేతానికి దోహదం చేస్తుందన్నారు. రైతులు పంటలు వేసేనాటికి అవసరమైన పెట్టుబడి సాయం అందించడం ద్వారా అన్నదాతల క్షేమం, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. రైతులకు రుణభారం లేకుండా చేయడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించడంలోనూ ప్రభుత్వం కీలకంగా వ్యవహరిస్తోందని వివరించారు. వ్యవసాయ యోగ్యమైన సొంత భూమి కలిగి ఉన్న రైతు కుటుంబాలకు (భూ విస్తీర్ణంతో సంబంధం లేకుండా ), అటవీ హక్కుల గుర్తింపు భూములు సాగు చేస్తున్న రైతు కుటుంబానికి పెట్టుబడి సాయంగా సంవత్సరానికి మూడు విడతలుగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.6000తో పాటు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతు కుటుంబానికి రూ. 14,000 చొప్పున మొత్తంగా అన్నదాత



సుఖీభవ-పీఎం కిసాన్ కింద ఏడాదికి రూ. 20,000 చొప్పున ఆర్థిక మద్దతు కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ పథకం ద్వారా అందుతున్న ఆర్థిక సహాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిధులను ఖాతాల్లో జమచేసే కార్యక్రమాలు జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలోనూ జరగనున్నాయని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

# ప్రభు దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

దేవుని సందేశాన్ని ప్రపంచవ్యాప్తంగా అందించడమే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న దైవజనులు పి సతీష్ కుమార్ విజయవాడ ప్రాంత వాసి కావడం , ఈ కార్యక్రమం లో ఆయన కూడా పాల్గొనడం సంతోషం గా ఉందన్నారు. దైవ జనులు సతీష్ కుమార్ ఫెలో షిప్ కు విజయవాడ ప్రాంత వాసులుగా రుణపడి ఉంటామన్నారు. దేవుణ్ణి నమ్ముకుని ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన దైవజనులు సతీష్ కుమార్ అన్నారు. భారతీయుడుడు గా ఇంతటి ఖ్యాతి పొందినందుకు తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ఇదే సింగ్ నగర్ స్టేడియంలో ప్రస్తుతం ఎమ్మెల్యే గా ఉన్న బొండా ఉమా మహేశ్వరరావు 2014-19 మధ్య కాలంలో సెమీ క్రిస్మస్ వేడుకలు తన సొంత ఖర్చుతో వైభవం గా జరిపారని, ప్రతి ఏటా జరపుతూనే ఉన్నారని గుర్తు చేశారు. కుల మతాలకు అతీ తంగా ప్రతి వేడుక విజయవాడ లో ఘనంగా జరగడం ఆనవాయితీ గా వస్తుందని, ఇటువంటి మంచి సాంప్రదాయం విజయవాడ ప్రజల సొంతం అన్నారు. యువ నాయకులు బొండా రవితేజ



మాట్లాడుతూ...ప్రపంచంలోనే అత్యధిక మంది ఆచరించే మతం క్రైస్తవ మతం అన్నారు. డిసెంబర్ వస్తే క్రిస్మస్ సంబరాలు ప్రతి ఒక్కరికీ గుర్తుకు వస్తాయన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతి ఏటా సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుగుతాయని గుర్తు చేశారు. విజయవాడ ప్రాంతం గన్నవరం లో స్థిరపడి ప్రపంచ ఖ్యాతిగాంచిన దైవజనులు సతీష్ కుమార్ అన్నారు. గడచిన ఎన్నికల్లో క్రైస్తవ సోదరులు తమ వెన్నంటి ఉన్నందుకు ధన్యవాదములు తెలిపారు. ఈ ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ (చిన్ని), బొండా రవితేజ లను దైవజనులు సతీష్ కుమార్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించి, ప్రజా సంక్షేమం, పాలకుల శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు ఎస్ జయరాజు, ఎం అనిల్ తదితరులు ముందుగా ఎంపీ కేశినేని చిన్ని, రవితేజ లకు ఘన స్వాగతం పలికారు.

# పాత ఇనుము దుకాణంలో పేలిన ఆక్సిజన్ సిలిండర్



### సైకిల్‌పై వెళుతున్న వృద్ధునికి తీవ్ర గాయాలు
### పట్టించుకోని దుకాణం యజమాని
### స్పందించని అధికార యంత్రాంగం

**పామర్రు మేజర్ న్యూస్ :** నియోజకవర్గ కేంద్రమైన పామర్రు లో ఆక్సిజన్ సిలిండర్ పేలి సైకిల్ పై వెళుతున్న వృద్ధునికి తీవ్ర గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి సేకరించిన వివరాలు ప్రకారం పామర్రు లోని కార్పెంటర్స్ కాలనీకి వెళ్లే రోడ్డులో ఈ ఘటన జరిగింది. స్థానిక కార్పెంటర్స్ కాలనీకి వెళ్లే రోడ్లో ప్రధాన రహదారి పక్కన పాత ఇనుము దుకాణం ఉంది. ఈ దుకాణం వద్ద ఉన్న ఆక్సిజన్ సిలిండర్లలో ఒక సిలిండర్ పేలడంతో సైకిల్ పై వెళుతున్న మన్నే దానియేలు (65) తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు హుటాహుటిన స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి గాయపడిన దానియేలును తరలించారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిలో దానియేలు చికిత్స పొందుతున్నాడు అయితే ఈ ప్రమాద కారణంగా తనకు కళ్ళు కనిపించడం లేదని బాధితుడు వాపోతున్నాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు ఆసుపత్రికి తీసుకువెళ్లారని, దుకాణ యజమాని మాత్రం తనకు సంబంధం లేనట్లు పట్టించుకోకుండా వదిలేశాడని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కన నిర్లక్ష్యంగా పదుల సంఖ్యలో ఆక్సిజన్ సిలిండర్లు నిలిపి ఉంచి ప్రజల ప్రాణాలతో పాత ఇనుము దుకాణం యజమాని చెలగాటమాడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండ వేడిమికి ఆక్సిజన్ సిలిండర్ పేలినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. రోడ్డుపై లారీలు నిలిపి నిత్యం పాత ఇనుము లోడు చేస్తుండటంతో తమ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా గడపాల్సిన పరిస్థితి ఉందని ఆ కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ, సంబంధిత అధికారులు రోడ్డ పక్కన ఇటువంటి వ్యాపారాలు నిర్వహించకుండా తగు చర్యలు తీసుకుని ప్రజలకు రక్షణ కల్పించాలని కార్పెంటర్స్ కాలనీవాసులు కోరుతున్నారు.

## 10వ తరగతి పరీక్షలకు 532 మంది విద్యార్థులు

**మొవ్వ మేజర్ న్యూస్:** ఈనెల 16వ తేదీ నుంచి జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు మండలంలోని 6 పరీక్ష కేంద్రాలో532 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. మండలంలోని 6 పరీక్ష కేంద్రాలకు కేటాయించిన అధికారులు గురువారం పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్(ఓ ఎస్ ఎస్ సి) కు ఈదర. మధుమోహన రెడ్డి (సి ఎస్), డి. లక్ష్మి కుమారి (డి.ఓ) పర్యవేక్షణలో 60 మంది విద్యార్థులు, మొవ్వ పీఎం శ్రీ,శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ పాఠశాల(ఒకేషనల్) కేంద్రానికి తాటిపర్తి ఉషారాణి (సి ఎస్), ఇ.వి. రామారావు (డి ఓ.)ల పర్యవేక్షణలో 215 మంది,కాజ శ్రీ పీకేటినర్సారెడ్డి జిల్లా పరిషత్ హై స్కూల్ కి చలమలశెట్టి లక్ష్మీనారాయణ (సిఎస్), ఎన్.సుల్తానా (డిఓ) పర్యవేక్షణలో 68 మంది,కోసూరు జిల్లా పరిషత్ హైస్కూల్(ఓ ఎస్ ఎస్ సి) కేంద్రానికి గరికపాటి. కృష్ణమోహన రావు (సిఎస్), మేకా. రాణి (డిఓ) పరిశీలనలో 60 మంది, పెదసనగల్లు జిల్లా పరిషత్ స్కూల్ కేంద్రానికిమల్యాన. శారదాకాంత(సి ఎస్,).వి విజయ లక్ష్మి (డిఓ) పర్యవేక్షణలో 89 మంది నిడుమోలుజిల్లా పరిషత్హై స్కూల్ కేంద్రానికి తోట. నాగేశ్వరరావు (సిఎస్), కుందేటి.ఝాన్సీ లక్ష్మి (డి.ఓ) ఆధ్వర్యంలో 45 మంది పరీక్షలువ్రాయనున్నారు. కేంద్రాలకు నియమించిన అధికారులు ఆయా పరీక్ష కేంద్రాలను పరిశీలించి, విద్యుత్, మంచినీరు, గాలి వెలుతురు సౌకర్యాలను పరిశీలించారు.

## పరీక్షల ప్యాడ్లు, స్టేషనరీ పంపిణీ



**చల్లపల్లి మేజర్ న్యూస్:** చల్లపల్లి రాజా కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో చల్లపల్లి రాజా హైస్కూల్లోని పదవ తరగతి విద్యార్థులు 36 మందికి పరీక్షల ప్యాడ్లు, స్టేషనరీలను గురువారం అందచేశారు. పూర్వవిద్యార్థుల సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ టి.సాంబశివరావు, పాఠశాల హెచ్ఎం ఎస్. సుదర్శన్ ప్రసాద్, తుమ్మల రేణుప్రసాద్, సూపర్నెంట్ శాస్త్రి, దోనేపూడి రాంభూపాల్, పూర్వవిద్యార్థులు మోర్ల శివ, బొల్లా ఫణి, మేకా రామకృష్ణ, అబ్దుల్ జిలానీ, దోనేపూడి రవి, తెనాలి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. పదవ తరగతి పరీక్షలు చక్కగా రాసి మంచి మార్కులు తెచ్చుకోవాలని విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు.



### మహిళా దినోత్సవం సందర్భంగా

## మహిళలకు కుట్టు యంత్రాల పంపిణీ

**గన్నవరం, మార్చి 12, మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అరుంధతి మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ అందించి వారికి కుట్టు మిషన్లు పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఏజీపీ అమర్తల సోమేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు కుటుంబానికి, సమాజానికి వెన్నెముకలని అన్నారు. వారి త్యాగాలు, ప్రతిభ అపారమని పేర్కొన్నారు. మహిళలకు గౌరవం, సమానత్వం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మహిళా సాధికారత కోసం అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న అరుంధతి మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు కొమ్మని కవితను అభినందించారు. వీరాబత్తిన అమల్ దాస్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఉంగుటూరు సర్పంచ్ కాటూరి వరప్రసాద్, జై భీమ్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండర్ కలతోటి నాగేశ్వరరావు, ఉదయగిరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కృపారావు, ఎస్సీ నాయకులు రవీంద్ర, షేక్ ఖాసీం, కేవీఆర్ కిశోర్, శేఖర్, విమల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గన్నవరం రోటరీ క్లబ్‌ను సందర్శించిన రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్



**గన్నవరం, మార్చి 12, మేజర్ న్యూస్ :** పోలియో నిర్మూలన కోసం నిధుల సేకరణ లక్ష్యంగా ఇచ్ఛాపురం నుంచి విజయవాడ వరకు నిర్వహిస్తున్న సైకిల్ ర్యాలీ సందర్భంగా రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రోటేరియన్ డా. వై. కల్యాణ్ చక్రవర్తి గన్నవరం రోటరీ క్లబ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా గన్నవరం రోటరీ క్లబ్‌లో నిర్వహించిన అధికారిక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రోటరీ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ప్రపంచం నుంచి పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, రోటరీ డిస్ట్రిక్ట్ తరపున పోలియో ఫండ్ సేకరించి రోటరీ ఇంటర్నేషనల్‌కు పంపిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రూ.40 లక్షల నిధులు సేకరించామని వెల్లడించారు. ఈ సందర్భంగా గన్నవరం రోటరీ క్లబ్ తరపున పోలియో ఫండ్‌కు సహాయంగా రూ.50 వేల విరాళాన్ని ప్రకటించారు. కార్యక్రమానికి గన్నవరం రోటరీ క్లబ్ అధ్యక్షులు జి.వి. రవిబాబు అధ్యక్షత వహించారు. క్లబ్ కార్యదర్శి కె. నాగరాజు అతిథులను స్వాగతిస్తూ, 2025 జూలై నెల నుంచి 2026 మార్చి వరకు క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమాల నివేదికను సభ్యులకు వివరించారు. అదేవిధంగా ప్రత్యేక కార్యక్రమాన్ని పురస్కరించుకుని క్లబ్ అధ్యక్షులు జి.వి. రవిబాబు రూ.12 వేల విలువైన వాటర్ కూలర్ యంత్రాన్ని కొనుగోలు చేసి స్థానిక ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు చల్లని తాగునీటి సౌకర్యం కోసం రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ చేతుల మీదుగా బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ గవర్నర్, అసిస్టెంట్ గవర్నర్, పాల్గొన్న రోటేరియన్లను గన్నవరం రోటరీ క్లబ్ తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ రోహిత్, సీనియర్ రోటేరియన్స్ చింతపల్లి సీతారామయ్య, గన్నే వెంకటరావు, జాస్తి విజయ్ భూషణ్ కుమార్, కంభంపాటి సూర్య చంద్రరావు, టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, వేములపల్లి కేశవరావు, గూడవల్లి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.




## మహారాష్ట్రియన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్న మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహమ్మద్

**విజయవాడ, మార్చి 12 మేజర్ న్యూస్ :** ప్రపంచ ఆభరణాల రిటైల్ రంగ రూపును, సమాజాన్ని విస్తృతంగా మార్చడంలో తన దూరదృష్టి గల నాయకత్వం, పోషించిన కీలక తోడ్పాటుకు గుర్తింపుగా మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహమ్మద్, లోక్‌మత్ మహారాష్ట్రియన్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్ 2026'లో ప్రతిష్టాత్మకమైన 'బిజినెస్ భూషణ్' అవార్డుతో సత్కరించబడ్డారు. ప్రతిష్టాత్మకమైన గేట్‌వే ఆఫ్ ఇండియా వద్ద జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో ప్రముఖ విధాన నిర్ణేతలు, పరిశ్రమ నాయకులు, వ్యాపార, వినోద రంగాలకు చెందిన ప్రముఖ వ్యక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, లోక్‌మత్ చైర్మన్ విజయ్ దర్దాతో పాటుగా మంత్రులు, అధికారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. ఈ గౌరవం అందుకున్న అనంతరం కృతజ్ఞతలు తెలిపిన మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహమ్మద్ మాట్లాడుతూ, "బాధ్యత, సమగ్రత, సమాజానికి శాశ్వత విలువను సృష్టించాలనే నిబద్ధతతో మార్గనిర్దేశం చేయబడి, తాము చేసే ప్రతి పనిలోనూ రాణించడాన్ని కొనసాగిస్తూనే, వాటాదారుల సమిష్టి వృద్ధి సూత్రంపై మా ప్రయాణం ప్రారంభమైనది" అని అన్నారు.

## కళ్యాణ మండపానికి ఏ.సి.లు బహుకరణ




**మొవ్వ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని నాట్య క్షేత్రం కూచిపూడి గ్రామంలో వేంచేసి ఉన్నా శ్రీగంగా బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం అనుబంధ కళ్యాణ మండపానికి గురువారం 1.30 లక్షల విలువ గల మూడు ఏసీలను దాతలు అందజేశారు. దేవాలయ పాలకమండలి కోశాధికారి జోశ్యుల నాగ జగన్ మోహన రావు కుటుంబ సభ్యులు ఘంటసాల ఆంజనేయ శాస్త్రి గజలక్ష్మి కుమారులు శ్రీనివాస్ కుమార్ - అన్నపూర్ణ వెంకట సుధాకర్-మైథిలి దంపతులు, వేమూరి దుర్గాప్రసాదరావువెంకట రామలక్ష్మి దంపతుల కుమారుడు దుర్గా నాగేశ్వర శర్మ -లీలా కుమారి దంపతులు జగన్మోహనరావు ద్వారా దేవాలయ పాలకమండలి ఉపాధ్యక్షులు పసుమర్తినారాయణమూర్తికి అందజేశారు. ఈ మూడు ఏసీ మిషన్లను కళ్యాణమండపం మొదటి అంతస్తులోఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాతలను పాలకమండలి సభ్యులు అభినందించారు.

## మినుము, పెసలు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రస్తుత రబీ సీజన్‌లో సాగు చేసిన మినుము, పెసలు పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయుటకు గాను డిసిఎంఎస్ ద్వారా మినుము కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు యెనిగళ్ళ నాగేశ్వరరావులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కనీస మద్దతు ధర క్వింటాకు మినుములు రు.7800, పెసలు రు.8768 లు యిస్తుందని రైతులు ఈ అవకాశమును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమములో మండల వ్యవసాయ అధికారి సునీల్, గుడ్లవల్లేరు గ్రామ టిడిపి అధ్యక్షులు, రైతు నాయకులు వల్లభనేని రంగ బాబు, వల్లూరుపల్లి వెంకటేశ్వరావు, అల్లూరి వాసు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌పివి టీకాలు ఆడబిడ్డలకు వరం : డాక్టర్ రాజేష్



పమిడిముక్కల మేజర్ న్యూస్: గర్భాశయ క్యాన్సర్ నుంచి రక్షణ కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన హెచ్‌పివి టీకాలు ఆడబిడ్డలకు వరమని కపిలేశ్వరపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మేరుగ రాజేష్ పేర్కొన్నారు. గురువారం కపిలేశ్వరపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ పివి టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ హెచ్ పివి(హ్యూమన్ పాపిల్లోమా వైరస్) టీకా గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్లను నివారించడంలో అత్యంత ప్రభావవంతమైనదని తెలిపారు. ప్రధానంగా 9-14 ఏళ్ల బాలికలకు లైంగిక క్రియాశీలతకు ముందు టీకా వేయించడం వల్ల 97శాతం వరకు రక్షణ లభిస్తుందని స్పష్టం చేశారు. అనేక గర్భాశయ క్యాన్సర్లను ఈ టీకా 97 శాతానికి పైగా నిరోధిస్తుంద న్నా రు. ఈ టీకా చేసిన అనంతరం 30 నిమిషాల పాటు వారిని తమ పర్యవే క్షణలో ఉంచుతామన్నారు. ఈ టీకా వల్ల కొందరికి నొప్పి, వాపు, స్వల్పంగా జ్వరం రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయని అయినప్పటికీ భయపడవల సిన పనిలేదని ఆయన పేర్కొన్నారు. ఇవి రెండు, మూడు రోజులలో పూర్తిగా తగ్గిపోతాయని డాక్టర్ రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరో గ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ఇందు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా దర్బార్

**ఎమ్మెల్యే కుమార్ రాజా**



పామర్రు మేజర్ న్యూస్ : ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, ఎన్ని అవరోధాలు ఎదురైనా వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పామర్రు శాసనసభ్యులు వరల కుమార్ రాజా పేర్కొన్నారు. ప్రగతి పథంలో మన పామర్రు కార్యక్రమంలో భాగంగా పామర్రులో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. పామర్రు పి-4 కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఆయన పరిశీలించారు. ఈ అర్జీలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఆయన అర్జీదారుల నుండి అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రజాదర్బార్ కార్యక్రమంలో మొత్తం 24 సమస్యలు నమోదు కాగా, వాటిలో 13 సమస్యలకు అక్కడికక్కడే తక్షణ పరిష్కారాలు అందించారు. మిగతా ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, తూర్పు కృష్ణాడెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, వివిధ శాఖల అధికారులు, సివిఎపి టీమ్ సభ్యులు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సకాలంలో పన్నులు చెల్లించి సహకరించండి

**డిప్యూటీ ఎంపిడిఓ వంగా శ్రీనివాస్**



పెదపారుపూడి మేజర్ న్యూస్: ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు మండల పరిధిలోని 11గ్రామ పంచాయతీలలో ఇంటి పన్నుల వసూళ్లు పూర్తి అయ్యాయని, మిగిలిన గ్రామాల ప్రజలు కూడా ఆయా పంచాయతీ అభివృద్ధి అధికారులకు సహకరించి వెంటనే పన్నులు చెల్లించాలని పెదపారుపూడి డిప్యూటీ ఎంపీడీఓ వంగా శ్రీనివాస్ కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా నగదు రహిత లావాదేవీలకు శ్రీకారం చుట్టిందని పన్నుల వసూళ్లు కేవలం ఆన్ లైన్ పే మెంట్ ద్వారానే చేయడం జరుగుతుందన్నారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 11 గ్రామ పంచాయతీలలో 100శాతం ఇంటిపన్నులు వసూళ్ళ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. అలాగే 5 పంచాయతీలు నాన్ టాక్సెస్ విభాగంలో కూడా 100 శాతం వసూళ్ళు పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన గ్రామాల్లోని ప్రజలంతా సకాలంలో పన్నులు చెల్లించడం ద్వారా పంచాయతీలకు సహకరించాలని శ్రీనివాస్ కోరారు. పాత బకాయిలు ఉన్నవారు, అలాగే ప్రస్తుత సంవత్సరం బకాయిలు ఉన్నవారు పన్నుల చెల్లింపు అనేది సామాజిక బాధ్యత గా స్వీకరించి వెంటనే చెల్లించి తగు రసీదులు పొందవలసిందిగా శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

# బాపులపాడు పీహెచ్‌సీలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రారంభం



**హనుమాన్ జంక్షన్, మార్చి 12, మేజర్ న్యూస్ :** గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఘనంగా ప్రారంభమైంది. వైద్యాధికారి డాక్టర్ కే. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అధ్యక్షుడు (ఎంపీపీ) వై. నగేష్, జడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, మండల పరిషత్ పరిపాలనా అధికారి (ఏవో) తోట త్రినాథ్ తిరుమలరావు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బాలికలకు హెచ్‌పీవీ టీకా వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ కే. శ్రీనివాస్ మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ మహిళల్లో అధికంగా కనిపించే వ్యాధుల్లో ఒకటని, దీనిని నివారించడంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా బాలికల ఆరోగ్య రక్షణ కోసం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం దాదాపు మూడు నెలలపాటు కొనసాగుతుందని, 14 సంవత్సరాలు నిండిన నుండి 15 సంవత్సరాలు పూర్తికాని వయస్సు గల బాలికలందరికీ ఈ టీకాను అందజేస్తామని వివరించారు. అలాగే ఈ వ్యాక్సిన్ వల్ల ఎలాంటి పెద్ద దుష్ప్రభావాలు ఉండవని, ఇది పూర్తిగా సురక్షితమని వైద్యులు తెలిపారు. తల్లిదండ్రులు ఎలాంటి అపోహలు, భయాలు పెట్టుకోకుండా తమ ఆడపిల్లలను సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకువచ్చి ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని కోరారు. బాలికల భవిష్యత్తు ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమం ప్రారంభమైన తొలి రోజే 11 మంది బాలికలకు హెచ్‌పీవీ టీకా అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# జి.రఘునందన్‌ను కలిసి సత్కరించిన కృష్ణాజిల్లా బి.సి సంక్షేమ సంఘం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆంధ్ర రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు డి.ఎం.ఇ. జి.రఘునందన్‌ను గురువారం విజయవాడలోని ఆయన కార్యాలయం లో కృష్ణాజిల్లా బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు శేకుబోయిన సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో థైరాయిడ్ పరీక్ష పరికరం నిరుపయోగంగా ఉందని సత్వరమే దాన్ని అందుబాటులోకి తెచ్చి పేద రోగులకు సత్వరమే అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు చేపట్టాలని గత నెల 18వ తేదీన డి. ఎం. ఇ కి ఆయన కార్యాలయంలో వినతిపత్రం ఇవ్వడం జరిగిందని అన్నారు. సమస్యను అర్థం చేసుకున్న డా.రఘునందన్ వెంటనే సంబంధిత పరికరాన్ని అందుబాటులోకి తేవడం పట్ల సుబ్రమణ్యం హర్షం వ్యక్తం చేశారు. సమస్యను సత్వరమే పరిష్కరించినందుకు డి.ఎమ్.ఈ కి కృతజ్ఞత పూర్వక ధన్యవాదాలు తెలుపుతూ బీ.సీ నాయకులు ఆయనను దుశాలువా, పుష్పగుచ్చంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భోగిరెడ్డి సుభాని, చేబోయిన కోటేశ్వరరావు, బి. శేషు, ఎం. పవన్, తదితర బీ.సీ నాయకులు పాల్గొన్నారు.

# గడ్డంరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరాన్ని సందర్శించిన బండ్రెడ్డి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం కోనేరు సెంటర్ లో గడ్డంరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు శిబిరాన్ని సందర్శించిన బండ్రెడ్డి రామకృష్ణ, అనంతరం ఆయన మాట్లాడుతూ క్రియా శీలక సభ్యత నమోదు గడువు పెరిగిందని జనసేన పార్టీ నాయకులు కీలక పదవుల్లో ఉన్న ప్రతి ఒక్కరు సభ్యత నమోదు బాధ్యతగా చేయించాలని పేర్కొన్నారు జనసేన పార్టీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు గడ్డంరాజు జనసేన పార్టీకి అంకిత భావంతో పనిచేస్తూ నూతన సభ్యత్వాల నమోదు పెంచడంపట్ల జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు మచిలీపట్నంలో సభ్యత్వ నమోదు ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందన్నారు జనసేన పార్టీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు గడ్డంరాజు మాట్లాడుతూ ఈనెల 17 వరకు క్రియాశీలక సభ్యత్వ నమోదు కొనసాగుతుందని తెలిపారు. జనసేన పార్టీ సభ్యత్వం కొరకు కోనేరు సెంటర్ లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని సంప్రదించాలని 400 రూపాయల సభ్యత్వంతో 5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని అన్నారు పార్టీలకు అతీతంగా మచిలీపట్నం ప్రజలందరూ సభ్యత్వాన్ని పొందిన5 లక్షల బీమా తో కుటుంబానికి రక్షణ పొంద వచ్చని అన్నారు సభ్యత్వ నమోదుకు ఆధార్ నామిని ఆధార్ పాస్పోర్ట్ సైజ్ ఫోటో 400 రూపాయలతో ప్రతి ఒక్కరు సభ్యత్వం చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మహమ్మద్ అన్సారి, దేవనూరివీరబాబు,గోవాడ సోమశేఖర్ తాడేపల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# గాడెల్లి డేవిడ్ శామ్యూల్‌కి ఘన సత్కారం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వందలాది నిరుపేదలకు అనునిత్యం సహాయ సహకారాలు అందిస్తూ... వేలాది మంది విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు విద్యను చేరువ చేస్తూ సమాజంలో విశేషసేవలు అందిస్తున్న గాడెల్లి డేవిడ్ శామ్యూల్ కు బాప్టిస్ట్ చర్చ్ ఫౌండేషన్, కవర్నెంట్ బాప్టిస్ట్ బైబిల్ కాలేజ్ & థియోలాజికల్ సెమినరీ. ద్వారా "గౌరవ డాక్టరేట్" ను బిషప్ వేసిపోగు.జయ కిషోర్ గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ దళిత జేఏసీ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా మచిలీపట్నం లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ అశేషమైన దైవభక్తితో రాష్ట్రవ్యాప్తంగా పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి డేవిడ్ శామ్యూల్ అందించిన సేవలను గుర్తిస్తూ గౌరవప్రదమైన డాక్టరేట్ ను అందించడం ముదా వాహం అన్నారు.నిరుపేద విద్యార్థులకు వసతి గృహాలను ఏర్పాటు చేసి వేలాదిమంది విద్యార్థులకు ఉచిత విద్యను అందించడంతోపాటు అనునిత్యం వందలాది నిరుపేదలకు గుప్త దానాలను చేస్తూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్న గాడెల్లి డేవిడ్ శామ్యూల్ కు గౌరవ డాక్టరేట్ ను అందించి సత్కరించడం అభినందనీయమన్నారు. వైసీపీ నాయకులుగా దళిత అభ్యున్నతికి గాడెల్లి డేవిడ్ శామ్యూల్ అందించిన సేవలు ఎనలేనివని అన్నారు... రానున్నరోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మరింత ఉన్నతిని పొందాలని ఆకాంక్షించారు. దళిత జేఏసీ, పలు ప్రజా సంఘాలు.. పుర ప్రముఖుల ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్ బిరుదును పొందిన గాడెల్లి డేవిడ్ శామ్యూల్ ను ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీత గాడెల్లి డేవిడ్ శామ్యూల్ మాట్లాడుతూ తనపై ఉన్న అభిమానంతో దళిత జేఏసీ నాయకులు పర ప్రముఖులు సత్కారం అందించడం పట్ల అభినందనలు తెలిపారు. దళిత జాతి అభ్యున్నతికి పేద బడుగు బలహీన వర్గాల ఔన్నత్యానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ లభిస్తాయని వెల్లడించారు... తమ సంస్థల ద్వారా నిరుపేదల సేవలను మరింత విస్తృత పరుస్తామని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో దళిత అధ్యక్షులు జక్కుల ఆనంద్ బాబు పలు దళిత సంఘాల నేతలు పుర ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే గద్దె దంపతులను కలిసిన ఏపీ మినిమం వేజెస్ అడ్వైజరి బోర్డు డైరెక్టర్





**విజయవాడ తూర్పు, మేజర్ న్యూస్ :** విజయవాడ తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌ని, టిడిపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధని ఏపీ మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు డైరెక్టర్ గా నూతనంగా నియమితులైన రెంటపల్లి శ్యామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెంటపల్లి శ్యామ్ ను అభినందిస్తూ కార్మికుల హక్కుల సాధనకై నిరంతరం శ్రమించాలని సూచిస్తూ మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు శ్యామ్ ను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తూ దృశ్యాలువాలతో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు కామ దేవరాజు, నాగవంశం వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ మొకర ఆదిబాబు, దూదేకుల వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పీరు బాబు, టి ఎన్ టి యు సి తూర్పు నియోజకవర్గం అధ్యక్షులు రాయవరపు అశోక్, టిడిపి ఎస్సీ సెల్ నాయకులు కామ వెంకట నరసింహారావు, టిఎన్టియుసి ఆటో స్టాండ్ అధ్యక్షులు వేముల శ్రీను, ఉపాధ్యక్షులు ఆదాం, సెక్రటరీ చిన్న, వేములపల్లి వరప్రసాద్, యేసు తదితరులు పాల్గొన్నారు.

# సేవాస్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనం ఎంపీటీసీ బొంతు సరోజినీ



### సేవలకు గ్రామస్తులు ప్రశంసల జల్లు....



**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామానికి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజినీ సాంబి రెడ్డి చేపట్టిన సేవా కార్యక్రమాలు గ్రామ ప్రజల ప్రశంసలను అందుకుంటున్నారు. ప్రజల సమస్యలను గుర్తిస్తూ సామాజిక బాధ్యతతో ముందుకు వస్తూ సేవాస్ఫూర్తిని చాటుకుంటున్నారు. నున్న గ్రామంలో ధోబి కాలనీకి చెందిన మేదూరి మరియమ్మ కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండగా, ఆమె వైద్య చికిత్స నిమిత్తం ఎంపీటీసీ బొంతు సరోజినీ రూ. 12,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సహాయం బాధిత కుటుంబానికి ఎంతో ఉపశమనం కలిగించిందని స్థానికులు తెలిపారు. అలాగే స్వచ్ఛమైన తాగునీటినీ అందించాలని నున్న గ్రామంలోని వీఆర్వో కార్యాలయానికి వోల్టాస్ కంపెనీకి చెందిన మంచినీటి కూలర్‌ను రూ. 9,500 వ్యయంతో అందించారు. అదేవిధంగా గ్రామంలోని సిఎస్ఐ చర్చి అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ. 10,000 విరాళాన్ని అందజేశారు. ప్రజా సేవే ధ్యేయంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న ఎంపీటీసీ బొంతు పిసరోజిని సాంబి రెడ్డి ని, గ్రామ పెద్దలు స్థానికులు అభినందిస్తూ ఆమె సేవలు ఇతర ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, యేసు రాజు, నిరంజన్, దుంపల సింహాచలం, జూపూడి కృష్ణ, ఎస్కే హుస్సేన్, పండు (గంగాధర్), శివకృష్ణ, జానీ రమేష్ వెంకట్రావు, జ్ఞానేష్ ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులమంటూ ఆక్రమణదారుల హంగామా...





### న్యాయం చేస్తామంటూ ఎమ్మెల్యే హామీ.....

### ఆక్రమణలు తొలగించాల్సిందే అంటూ ప్రజల డిమాండ్

**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రు సెంటర్ లో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆక్రమణదారులైన పలువురు వ్యాపారస్తులు రోడ్డు విస్తరణ కారణంగా తమ వ్యాపారాలు దెబ్బతింటాయంటూ ఎమ్మెల్యే వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. తాము చిరు వ్యాపారులమని తమ వ్యాపారులు దెబ్బతింటే జీవనోపాధి కోల్పోయి కుటుంబ పోషణ ఇబ్బందికరంగా మారుతుందంటూ ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వారికి తగిన న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం జాతీయ రహదారుల శాఖకు చెందిన అధికారులతో ఆయన మాట్లాడి చిరు వ్యాపారులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రధాన కూడలిలో జరుగుతున్న పనుల వల్ల ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలుగుతోందని గుర్తుచేస్తూ వాహనదారులకు ఇబ్బంది కలగకుండా రోడ్డు పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కాగా రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే కుమార్ రాజా భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని, అయితే వెనుక వైపున దుకాణాలు ఉన్నా వాటి ముందు రోడ్డు మీద వరకు ఆక్రమణలు విస్తరించి వ్యాపారాలు చేసే వారిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ఆక్రమణదారులే తాము చిరు వ్యాపారులం అంటూ ఎమ్మెల్యేను, ఇతర పార్టీ నాయకులను మభ్యపెడుతున్నారని, వారు నిజంగా చిరు వ్యాపారులు కారని ఆక్రమణదారులని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అటువంటి వారిపట్ల ఎమ్మెల్యే గాని ఇతర నాయకులు గాని కనికరం చూపవలసిన అవసరం లేదని వారు పేర్కొంటున్నారు. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులను, రోడ్డుపై నిలుచున్న వారిని అసభ్య పదజాలంతో దూషిస్తూ నిత్యం ప్రయాణికులను దుర్భాషలాడుతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. ఇటువంటివారి పట్ల అప్రమత్తంగా ఉండి నిజమైన చిరు వ్యాపారులను గుర్తించి వారికి మాత్రం తగు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆక్రమణదారులందరికీ ఆక్రమణలకు వెనుక వైపున దుకాణాలు ఉన్నాయని వారు ఆ దుకాణాలలో వ్యాపారం చేసుకునేలా తగు చర్యలు చేపట్టాలని తద్వారా ఆక్రమణలు లేకుండా చూడాలని ప్రజాప్రతినిధులు, అధికారులను స్థానికులు కోరుతున్నారు. కాగా విస్తరణ పనుల పర్యవేక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఒలింపియాడ్ పరీక్షలలో మదర్ థెరిస్సా విద్యార్థుల ప్రతిభ



**పామర్రు మేజర్ న్యూస్ :** ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ పరీక్షలలో మండల పరిధిలోని రా పర్లలో గల మదర్ థెరిస్సా ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు 8 మంది ఉత్తమ ప్రతిభను కనపరచి బంగారు పత కాలు సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షల్లో తమ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు నూటికి నూరు శాతం మార్కులు సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్.పుష్ప యాకోబ్ తెలిపారు. ఈ విద్యార్థులు బంగారు పతకాలతో పాటు ప్రశంస పత్రాలు కూడా అందుకున్నట్లు ఆమె చెప్పారు. కాగా ఈ విద్యార్థులను, వారికి శిక్షణ అందించిన ఉపాధ్యాయులను గురువారం ప్రిన్సిపాల్ పుష్ప యాకోబ్ తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

## రగ్బీ పోటీల్లో విద్యార్థులకు బంగారు, వెండి పతకాలు



**గన్నవరం, మార్చి 12, మేజర్ న్యూస్ :** రాష్ట్ర స్థాయి పన్నెండేళ్ల లోపు బాలబాలికల రగ్బీ పోటీలలో గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించి ప్రతిభ చాటారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏ. సునీల గురువారం పత్రికలకు తెలిపారు. ఈ నెల 8 న గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ అంతర్జిల్లాల పన్నెండేళ్ల లోపు రగ్బీ పోటీలలో గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని జి. భార్గవి, 6వ తరగతి విద్యార్థి యస్.డి. కాశీం ఉమ్మడి కృష్ణా జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించినట్లు ఆమె తెలిపారు. ఈ పోటీలలో అసాధారణ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించిన కృష్ణా బాలికల జట్టు బంగారు పతకాన్ని, బాలుర జట్టు వెండి పతకాన్ని కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. జట్టు విజయానికి కృషి చేసి బంగారు పతకం సాధించిన భార్గవి, వెండి పతకం అందుకున్న కాశీంను పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సునీలతో పాటు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు. అలాగే విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించిన వ్యాయామ విద్య సహాయకులు ధనియాల నాగరాజు, షేక్ మీరా సాహెబ్‌లను కూడా ప్రశంసించారు.

## వీరంకిలాకు పి.హెచ్.సిని సందర్శించిన ఎమ్మెల్యే



**పమిడిముక్కల మేజర్ న్యూస్:** మండల పరిధిలోని వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది పనితీరు, ల్యాబ్ పరికరాలు, రిజిస్టర్ల పరిశీలన, సిబ్బందికి ఉన్న సౌకర్యాలు అన్నింటినీ సమీక్షించారు. ఈ సందర్భంగా వైద్యురాలు షేక్ సైరా కాటూన్ కు రోగులతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. రోగుల అభిప్రాయాలు అడిగి తెలుసుకుని ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే పై అధికారులతో మాట్లాడి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.





### చల్లపల్లి వేడుకల్లో యువ నాయకులు వికాస్ బాబు

**చల్లపల్లి మేజర్ న్యూస్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను చల్లపల్లిలో గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మధ్య స్థానిక దళితవాడలోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వికాస్ బాబు, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాణాసంచా, టపాసులు పెంచి సంబరాలు చేశారు. ప్రతి ఒక్కరిని పలకరిస్తూ వికాస్ బాబు పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చల్లపల్లి జడ్పిటిసి సభ్యులు రాజులపాటి కళ్యాణి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు రాజులపాటి శివప్రసాద్, పార్టీ దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లూరి శామ్యూల్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోపిదేవి ద్వారకానాథ్, చల్లపల్లి మండల కన్వీనర్ శీరం వెంకట సత్యనారాయణ మండల యూత్ అధ్యక్షులు వెనిగళ్ళ తారక జగదీష్, మండల మహిళా అధ్యక్షురాలు బొందలపాటి లక్ష్మీ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మెరుగు రమేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### గుడ్లవల్లేరులో వైసీపీ ఆవిర్భావ దినోత్సవం



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వర రావు (నాని) ఆదేశాల మేరకు గుడ్లవల్లేరులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించామని గుడ్లవల్లేరు వైఎస్సార్సీపీ అధ్యక్షులు జాన్ బెన్నీ లింగం తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను కృష్ణా జిల్లా ఆర్గనైజేషన్ సెక్రెటరీ కోటప్రోలు నాగు, మాజీ బ్యాంక్ డైరెక్టర్ పడమటి సుజాత, ఎంపీటీసీ సభ్యులు పెనుమాల పూర్ణ కవిత చేతుల మీదగా ఆవిష్కరించడం జరిగినది. అనంతరం కేక్ కట్ చేసి సంతోషాన్ని వ్యక్తపరిచారు. కోటప్రోలు నాగు మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గుడ్లవల్లేరులో దినదినం బలపడుతుందని జగన్మోహన్ రెడ్డి గతంలో ఇచ్చిన పథకాలే రేపు ఆయన అధికారంలో తీసుకొస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కొనాల లూథర్, రాజు, కొనాల ప్రసాద్, రామిశెట్టి వెంకటేశ్వరరావు, వెంకట్రావు, శివ, శ్రీను, మేకల అనిల్, పడమట నాంచారయ్య, జోజి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### నర్సరీల నిర్వహణతోనే అధిక లాభాలు



**జగ్గయ్యపేట, మార్చి 12, మేజర్ న్యూస్ :** జాతీయ వ్యవసాయ పరిశోధన, నిర్వహణ అకాడమీ శిక్షణలో భాగంగా నాల్గవ రోజు డా. కె.ఎల్. రావు కృషి విజ్ఞాన కేంద్రం, గరికపాడు ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల రైతులకు "వాణిజ్య నర్సరీ నిర్వహణ" పై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొలుత నందిగామ డివిజన్ ఉద్యానవన అధికారిణి టి.వర్ధిని నర్సరీ రికార్డుల నిర్వహణ, పాలిహౌస్ ఏర్పాటుకు అయ్యే ఖర్చుల గురించి వివరించగా, అనంతరం కేవీకే ఉద్యానవన విభాగం శాస్త్రవేత్త డా. కె.లక్ష్మీ కళ రైతులకు ప్రోట్రే మిక్సింగ్, కోకోపిట్ మీడియా తయారీ విధానాలను ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపారు. మధ్యాహ్నం జరిగిన సెషన్‌లో కార్యక్రమ సమన్వయకర్త డా. ఎం. రవి కిషోర్ వాణిజ్య నర్సరీ రంగంలో ఈ-కామర్స్, మార్కెటింగ్ ద్వారా లభించే అవకాశాలను రైతులకు వివరించారు. చివరగా రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించి ఈ శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పామర్రులో ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు



**పామర్రు మేజర్ న్యూస్ :** పేదల బ్రతుకులలో వెలుగు నింపాలనే లక్ష్యంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పడిందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. గురువారం పామర్రు లోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే వైఎస్సార్ సీపీ అజెండా అని పేర్కొన్నారు. ఏ రాజకీయ పార్టీతో పొత్తులు లేకుండా పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు ప్రతి ఎన్నికల్లోనూ ఒంటరిగా పోటీ చేసి విజయాలను సొంతం చేసుకున్న ఏకైక పార్టీ వైఎస్సార్సీపీ అన్నారు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా అనునిత్యం ప్రజా పక్షంగానే వైఎస్సార్సీపీ అడుగులు ముందుకు వేసిందన్నారు. సంక్షేమ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రజా సమస్యలపై పోరాడటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. పార్టీ పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పనిచేస్తోందన్నారు. రానున్న రోజుల్లో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. 2029లో మళ్లీ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకమై, జగన్ ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ఇప్పటి నుంచే నడుం బిగించాలని పిలుపునిచ్చారు. వైయస్ జగన్ నాయకత్వంలో పార్టీ 15 వసంతాలను విజయవంతంగా పూర్తి చేసుకుని, 16వ ఏట అడుగుపెట్టిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. అలాగే వైయస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని మండలాల పార్టీ అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, రాజులపాటి రాఘవరావు, యలమంచిలి గణేష్ బాబు, గోగం సురేష్, జడ్పిటిసి సభ్యులు కూనపరెడ్డి స్వరూపరాణి, రాజులపాటి పార్వతి, జొన్నల రామ్మోహన్ రెడ్డి, పామర్రు ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ళ రమాదేవి, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మూల్పూరి హరీష, జిల్లా మహిళా కార్యదర్శి కోలవెన్ను పద్మ, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కొడమంచిలి మహేష్, జిల్లా నాయకులు దేవభక్తుని రాము, మండా శ్రీనివాసరెడ్డి, ఆరుమళ్ళ శ్రీనాథరెడ్డి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 2029లో భారీ మెజారిటీయే లక్ష్యం



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. మండలంలోని పలుచోట్ల నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరణ, కేక్ కట్టింగ్,స్వీట్లు, బాణాసంచేలు పేల్చి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. నామినేటెడ్ పదవుల్లో ఉన్న నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు,మహిళలు, కార్యకర్తలు కలిసి విజయవాడ రూరల్ మండలం లో 16 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాజన్న ఆశయ సాధనలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా, వెనకడుగు వేయకుండా ప్రజల నమ్మకంతో ఎదిగిన పార్టీ మన వైయస్సార్ పార్టీ, నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తూ వారి కష్టసుఖాల్లో తోడుగా ఉంటుందని,పార్టీ లో నూతన ఉత్తేజంతో ముందుకు వెళ్లాలని జడ్పిటిసి సభ్యుడు కె.సువర్ణరాజు చెప్పారు.విజయవాడ రూరల్ మండలం ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి,అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయవాడ రూరల్ మండలం అధ్యక్షుడు నిడమానూరు సర్పంచ్ మాట్లాడుతూ రాబోయే 2029 ఎన్నికల్లో అత్యంత భారీ మెజారిటీతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయం, సంక్షేమ రథసారథిగా ఆంధ్ర రాష్ట్రాన్ని స్వర్ణయంగా తీర్చి దిద్దిన పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, దేశంలో కనివిని ఎరుగని స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తుందని తెలియజేశారు. రాష్ట్ర కార్యదర్శి, గుడివాడ నియోజకవర్గ పరిశీలకులు రామిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ...రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, పార్టీని మరింత బలోపేతం చేయాలని తప్పకుండా 2029 సంవత్సరంలో వైఎస్ఆర్ పార్టీ జెండా రాష్ట్రంలో రెపరెపలాడుతుందని చెప్పారు. ప్రస్తుతం రెడ్ బుక్కు రాజ్యాంగం నడుస్తుందని,ఏ కార్యకర్తనైతే ఇబ్బందులకు గురి చేశారో వారందరికీ తగిన గుణపాఠం చెప్పే రోజు తప్పకుండా వస్తుందని, గన్నవరం నియోజకవర్గంలో వల్లభనేని వంశీని ఎమ్మెల్యే గా,రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డిని సీఎంగా అత్యంత భారీ మెజార్టీతో రాష్ట్ర ప్రజలు గెలిపిస్తారని అంబాపురం గ్రామ అధ్యక్షుడు నల్లమోతు చంద్రశేఖర్ చెప్పారు.గ్రామస్థాయి నుండి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీనీ బలోపేతం చేస్తూ జగన్మోహన్ రెడ్డిని సీఎంగా గెలిపించడానికి అహర్నిశలు కష్టపడి పార్టీని అధికారంలోకి తెచ్చుకుంటామని, పార్టీ నాయకులు కార్యకర్తలకు అండగా ఉంటామని, సంక్షేమంలో మనమే ముందున్నామని పి.నైనవరం గ్రామ పార్టీ అధ్యక్షుడు దావు వెంకటేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు.పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని నున్న గ్రామ పార్టీ అధ్యక్షుడు ముత్తారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ముగింపులో విజయవాడ రూరల్ మండలం లో అన్ని ప్రాంతాల్లో వైయస్సార్ పార్టీ వర్ధిల్లాలి, జోహార్ వైయస్ఆర్ జై జగన్ జై జై జగన్ అంటూ పార్టీ విజయానికి నినాదాలు చేస్తూ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## బడ్జెట్ కేటాయింపుల్లో బహుజనులకు న్యాయం జరగాలి



**విజయవాడ, మేజర్ న్యూస్ :** దేశంలో ప్రతి సంవత్సరం బడ్జెట్‌లు ప్రవేశపెడుతున్నప్పటికీ, వాటి ఫలితాలు బహుజనుల జీవితాల్లో ఎంతవరకు ప్రతిఫలిస్తున్నాయనే అంశంపై విస్తృత చర్చ అవసరం ఉందని పలువురు సామాజిక కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. రాజ్యాంగం కల్పించిన ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు నిజంగా షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, బీసీలు, మైనారిటీల అభివృద్ధికి వినియోగించబడుతున్నాయా? లేక ఇతర అవసరాలకు మళ్లించబడుతున్నాయా? అనే ప్రశ్నలు సమాజంలో ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో "సామాజిక న్యాయం ఆర్థిక కేటాయింపులు బహుజనుల భవిష్యత్తు" అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు మార్చి 14, 2026 (రెండవ శనివారం) ఉదయం 10 గంటలకు గుంటూరు జిల్లా పరిషత్ ఏసీ సమావేశ మందిరంలో నిర్వహించబడనుంది. ఈ సదస్సులో మాజీ ఉన్నతాధికారులు, సామాజిక ఆలోచనాపరులు పాల్గొని ప్రసంగించను న్నారు. ముఖ్య వక్తలుగా డాక్టర్ పి.వి. రమేష్, ఐఏఎస్ రిటైర్డ్, డాక్టర్ ఉప్పులేటి దేవి ప్రసాద్, ఐఆర్ఎస్ రిటైర్డ్, జి. విజయ్ కుమార్, ఐఏఎస్ రిటైర్డ్, డాక్టర్ జె.జె. పూర్ణచంద్రరావు, ఐపీఎస్ రిటైర్డ్ పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేయనున్నారు. సదస్సులో ముఖ్యంగా ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల వినియోగం, బడ్జెట్ కేటాయింపుల్లో సామాజిక న్యాయం, బహుజన సమాజ అభివృద్ధికి అవసరమైన విధానాలు, మాల సమాజంపై జరుగుతున్న అన్యాయాలు, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై చర్చ జరుగనుంది. ఈ సదస్సుకు బహుజన మేధావులు, విద్యార్థులు, ఉద్యోగులు, యువత, సామాజిక చైతన్యవంతులు పెద్ద సంఖ్యలో పాల్గొని చర్చను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు. "మన బడ్జెట్ మన హక్కు మన భవిష్యత్" అనే నినాదంతో ఈ సదస్సు నిర్వహించబడుతోంది. ఏపీఎంయుఎస్ రాష్ట్ర కార్యవర్గం : బేతాళ సుదర్శనం, నూతలపాటి జగదీష్, అంబటి అనిల్ కుమార్, ఏ సర్వేశ్వరరావు, పులిదండి కుటుంబరావు, వై శ్యామ్ కుమార్, ప్రశాంత్, తదితరులు

# కష్టపడే గిరిజన బిడ్డలకు గుర్తింపు లేని చోట మేం ఉండలేం





**జై భీమ్ రావ్ భారత్ పార్టీకి రామప్ప నాయక్ రాజీనామా!**

**విజయవాడ మార్చి 12, మేజర్ న్యూస్:** జై భీమ్ రావ్ భారత్ పార్టీలో విలువలు, క్రమశిక్షణ కనుమరుగయ్యాయని, కష్టపడి పనిచేసే వారిని కాదని కేవలం కులపక్షపాతంతో పదవులు ఇస్తున్నారని ఆరోపిస్తూ ఆ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు, ప్రజాబలం సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రామప్ప నాయక్ తన పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయనతో పాటు జిల్లావ్యాప్తంగా వివిధ నియోజకవర్గాల్లో నియమితులైన 50 మంది కమిటీ సభ్యులు కూడా పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా రామప్ప నాయక్ మీడియాతో మాట్లాడుతూ పార్టీ అధిష్టానం, వ్యవస్థాపక అధ్యక్షులు జడ శ్రావణ్ కుమార్ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

**ప్రకటనలోని ప్రధానాంశాలు:** ఒక్క రూపాయి ఇవ్వలేదు - అంతా నా కష్టమే: "గడిచిన ఒకటిన్నర ఏళ్లుగా జిల్లాలో పార్టీ పేరు వినిపిస్తుందంటే అది నా కృషి. పార్టీ కార్యాలయానికి నెలకు రూ.8,000 అద్దె, కరెంట్ బిల్లులతో పాటు, పార్టీ జెండాలు, కండువాలు కూడా నా సొంత డబ్బులతోనే ప్రింటింగ్ చేయించుకున్నాను. జడ శ్రావణ్ కుమార్ జెండాను మోస్తున్న మాకు, పార్టీ నుండి కనీసం ఒక్క రూపాయి కూడా ఆర్థిక సహాయం అందిన దాఖలాలు లేవు.

**అవమానకరంగా పదవి మార్పు:** "గత ఫిబ్రవరిలో స్వయంగా నియామక పత్రం ఇచ్చి, నెల తిరగక ముందే కనీస సమాచారం లేకుండా, అసలు నేను రాజీనామా చేయకుండానే బాధ్యతల నుండి తప్పించడం అత్యంత దారుణం. కనీసం ఫోన్ చేసి చెప్పాలన్న బాధ్యత కూడా పార్టీకి లేదా? ఇది కేవలం ఏకపక్ష నిర్ణయం మాత్రమే కాదు, నన్ను నమ్ముకున్న కార్యకర్తలను అవమానించడమే."

**కులపక్షపాతంపై నిలదీత:** "గిరిజనులను కేవలం పార్టీ ఐలోపేతం కోసమే వాడుకుంటున్నారా? పార్టీ కోసం రక్తం చెమటగా మార్చి పనిచేసిన వారిని కాదని, కేవలం తమ కమ్యూనిటీకి చెందిన వ్యక్తులకు రాష్ట్ర కార్యదర్శి, జిల్లా కోఆర్డినేటర్ వంటి కీలక పదవులు ఎలా కట్టబెడతారు? ఇది గిరిజన బిడ్డలపై జరుగుతున్న వివక్ష కాదా?"

**నేతల వలసలకు కారణం ఇదే:** "గతంలో సత్యసాయి జిల్లా నుంచి సోమన్న మురళి గౌడ్ అనంతపురం జిల్లాలో ఆచారి గోవిందు గుంతకల్లు నియోజకవర్గంలో సూరిబాబు, ఏసన్న, తాడపత్రి నాగరాజు, కళ్యాణ్ దుర్గం నియోజకవర్గం వెంకటేశులు. ఉరవకొండలో సువర్ణ. రాయదుర్గంలో రమేష్. గుంతకల్లు గౌసియా. వంటి నేతలను కూడా ఇలాగే అవమానకరంగా పక్కన పెట్టారు. పార్టీ ప్రోటోకాల్ లేకపోవడం వల్లే 2024 ఎన్నికల్లో పోటీ చేసిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు నేడు పార్టీలో లేరు. ఇలా అందరినీ తీసేసుకుంటూ పోతే పార్టీలో పనిచేసే వారు ఎవరు ఉంటారు?"

"ఆత్మగౌరవం లేని చోట, కార్యకర్తల కష్టానికి గుర్తింపు లేని చోట ఒక నిమిషం కూడా ఉండటం ఇష్టం లేక, నా 50 మంది కమిటీ సభ్యులతో కలిసి రాజీనామా చేస్తున్నాను. నాకు జరిగిన ఈ అన్యాయం రేపు మరో కార్యకర్తకు జరగకూడదనే ఉద్దేశంతోనే ఈ పత్రికా ప్రకటన విడుదల చేస్తున్నాను." అని ప్రజాబలం సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రామప్ప నాయక్ పేర్కొన్నారు.

## ఐక్యూ జెడ్11ఎక్స్ ఆవిష్కరణ




**విజయవాడ, మార్చి 12, మేజర్ న్యూస్ :** హై-పర్ఫార్మెన్స్ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఐక్యూ భారత్‌లో ఐక్యూ జెడ్11ఎక్స్ను ఆవిష్కరించింది. చదువు, వినోదం, తమ లక్ష్యాలను సమతుల్యం చేసుకునే విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ ఫోన్, సెగ్మెంట్‌లో ముందంజలో ఉన్న బ్యాటరీ, శక్తివంతమైన ప్రాసెసింగ్ సామర్థ్యాలు, సాఫీగా మల్టీటాస్కింగ్ చేయడానికి అనువైన పనితీరుతో పాటు మెరుగైన దృఢత్వాన్ని అందిస్తుంది. ఈ రోజుల్లో విద్యార్థుల వేగవంతమైన జీవనశైలికి అనుగుణంగా రూపొందించిన ఈ డివైస్, రోజంతా వారికి ఉత్పాదకత, వినోదం, కనెక్టివిటీని అందిస్తుంది. ఐక్యూ జెడ్-సిరీస్‌ను మరింత బలపరిచే ఈ సెగ్మెంట్‌లో అత్యంత వేగవంతమైన స్మార్ట్‌ఫోన్ అయిన ఐక్యూ జెడ్11ఎక్స్ మీడియా టెక్ డైమెన్సిటీ 7400-టర్బో ప్రాసెసర్‌తో పని చేస్తుంది. ఇది అనుటుటులో 10 లక్షలకు పైగా స్కోర్ సాధిస్తుంది. ఈ స్మార్ట్‌ఫోన్‌లో సెగ్మెంట్‌లోనే అతిపెద్ద 7200 ఎంఏహెచ్ బ్యాటరీ ఉండి, 44డబ్ల్యు ఫ్లాష్ చార్జ్ సపోర్ట్‌తో వస్తుంది. ఇది ఐపీ68 & ఐపీ69+ డస్ట్, వాటర్ రెసిస్టెన్స్, మిలిటరీ-గ్రేడ్ డ్యూరబిలిటీతో వస్తుంది. ఫోన్‌లో 50 ఎంపీ సోనీ ఏఐ-పవర్డ్ ప్రధాన కెమెరా ఉండి, ముందు, వెనుక కెమెరాలతో 4కే వీడియో రికార్డింగ్ సౌకర్యం అందుబాటులో ఉంది. ఒరిజన్‌ఓఎస్ 6 పై పనిచేసే ఈ డివైస్ ఏఐ ఫీచర్లను సపోర్ట్ చేస్తుంది. 2 సంవత్సరాల ఓఎస్ అప్డేట్లు, 4 సంవత్సరాల సెక్యూరిటీ అప్డేట్లు అందిస్తారు.

# క్రీడల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వపరంగా సహకరించాలని విజ్ఞప్తి



**విజయవాడ మార్చి 12, మేజర్ న్యూస్:** కేంద్ర యువజన,క్రీడల శాఖ మంత్రి మనసుఖ్ మాండవ్య ను విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని ) న్యూఢిల్లీలో గురువారం కలిశారు. రాష్ట్ర శాప్ చైర్మన్ రవి నాయుడు, ఎండి భరణి తో కలిసి కేంద్ర మంత్రిని పార్లమెంటు ఆవరణలో కలిసిన ఎంపీ శివనాథ్ ఆంధ్రప్రదేశ్ లో క్రీడల అభివృద్ధి కి కేంద్ర ప్రభుత్వపరంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఏపీలో క్రీడల అభివృద్ధిపై చర్చ జరిపారు. ఖేలో ఇండియా ఇన్ఫ్రా ద్వారా పలు క్రీడా ప్రాజెక్టులకు నిధులు కోరి రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో మొత్తం 53 ప్రాజెక్టులకు రు. 1106 కోట్ల మేర అంచనా వ్యయంతో ప్రాజెక్టుల ప్రతిపాదన చేశారు. ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి మనసుఖ్ మాండవ్య త్వరలోనే అందుకు సంబంధించిన ప్రాజెక్టుల మంజూరుకు నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో క్రీడా ప్రాజెక్టులను ఎక్కడెక్కడ ఏర్పాటు చేయదలచారో లిఖిత పూర్వకంగా మంత్రికి ఎంపీ కేశినేని శివనాథ్ శాప్ ఎండీ, చైర్మన్‌తో కలసి కేంద్ర మంత్రికి తెలిపారు.

## రూల్స్ పాటించక పోతే కఠిన చర్యలు

కోడూరు ఎస్ఐ కే చాణక్య



**కోడూరు మేజర్ న్యూస్ :** వాహనం నడిపే వ్యక్తి దగ్గర బండికి సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా ఉండాలి,లైసెన్స్ ఆర్ సి పొల్యూషన్ ఇన్సూరెన్స్ ముఖ్యంగా హెల్మెట్ ఏది లేకపోయినా కఠిన చర్యలు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, మద్యం సేవించి వాహనాలు నడపరాదు డ్రంక్ అండ్ డ్రైవ్ చట్టరీత్యా నేరం ఇది మీ ప్రాణాలకే కాకుండా ఇతర ప్రాణాలకు కూడా ముప్పు కలిగిస్తుంది. వాహనాలను వేగం తగ్గించి నడపాలి ముఖ్యంగా సెంటర్లో స్కూల్ దగ్గర జాగ్రత్తగా ఉండాలి, అని ఎస్ఐ కే చాణిక్య సూచించారు. త్రిబుల్ డ్రైవింగ్ అతివేగం,మైనర్లు వాహనం నడిపిన కఠిన చర్యలు తప్పవని అన్నారు.



# ఎపి ఎంఎస్ఎంఇ ఎక్స్‌పో - 2026ను ఉపయోగించుకోవాలి



**ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఇ ఇండస్ట్రీస్ గౌరవ అధ్యక్షులు బాయన వెంకట్రావు**

**విజయవాడ, మార్చి 12, మేజర్ న్యూస్ :** ఈ నెల 13, 14, 15 తేదీల్లో జరుగనున్న ఎక్స్ పోను పారిశ్రామిక వేతలు విద్యార్థులు ఔత్సాహికులు ఉపయేగించుకోవాలని బాయన వెంకట్రావు గౌరవ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఇ ఇండస్ట్రీస్ కోరారు.గురువారం స్థానిక ఆటోనగర్ ఎంఎస్ఎంఇ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేపు విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏపీ ఎంఎస్ఎంఇ ఎక్స్‌పో - 2026 ను విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులు ఈ కార్యక్రమానికి స్థానిక పార్లమెంట్ సభ్యులు (ఎంపి) కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, మాజీ ఎంపీ పల్లె నారాయణ ప్రసాద్, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారని తెలిపారు. చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి కోసం వివిధ రకాల ఉత్పత్తుల ప్రదర్శన ఉంటుందన్నారు.పరిశ్రమల్లో అవసరమైన నూతన ఆవిష్కరణలు, టెక్నాలజీ అప్‌గ్రేడేషన్, దానికి సంబంధించిన మెషినరీ ప్రదర్శనకు ఉంచుతారని తెలిపారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ నుండి కూడా ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. విద్యార్థులు లేదా ఎవరైనా కొత్తగా ఏదైనా కనిపెడితే వాటిని ఇక్కడ ప్రదర్శించే అవకాశం కల్పిస్తున్నారని, ప్రభుత్వ, బ్యాంకుల భాగస్వామ్యం కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఇ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులు, అలాగే ఐసిఐసిఐ వంటి వివిధ బ్యాంకుల ప్రతినిధులు కూడా పాల్గొని, పరిశ్రమలకు అవసరమైన లోన్ల గురించి వివరిస్తారని.ఎపి ఎంఎస్ఎంఇ అసోసియేషన్ వారు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి, కొత్తగా పరిశ్రమలు పెట్టాలనుకునే వారికి ఇండస్ట్రియల్ పాలసీల పై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు, ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని వారు కోరారు.ఆనంతరం ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్ రామచంద్రరావు మాట్లాడుతూ గత 7ట సంవత్సరాలుగా పరిశ్రమల ప్రోత్సాహాన్ని ఇస్తు పరిశ్రమల సమస్యలు ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిశ్రమల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నామని తెలిపారు.అనంతరం జెఆర్డీ టాటా,ఐలా చైర్మన్ టి.వినోద్ మాట్లాడుతూ ఆటో మొబైల్ కు సంభందించిన రైతులకు సంభందించిన అన్ని రకాల పరికరాలు లభిస్తాయని తెలిపారు. ఈసందర్భంగా ఎగ్జిబిషన్ కు సంభవించిందించిన కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఎజి.సాంబశివరావు ఎగ్జిబిషన్ కమిటీ చైర్మన్, ఛైర్మన్,కమిటీ సభ్యులు,మధు మూర్తి, ఎ.నరసింహారావు,టివి నాగేశ్వరరావు, గద్దె సాంబశివరావు, ఆమర్నాద్, తదితరులు పాల్గొన్నారు.

## దేవస్థాన అభివృద్ధికి దాతల సహాయం అపూర్వం



**మోపిదేవి మేజర్ న్యూస్:** దేవస్థానం అభివృద్ధికి దాతల సహాయం అపూర్వమని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు అన్నారు. స్వయంభూ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానానికి ప్రముఖ సినీ నిర్మాత అట్లూరి నారాయణరావు ఇటీవల సుమారు రూ.కోటికి పైగా వ్యయంతో బహుకరించిన నూతన టేకు రథాన్ని భద్రపరిచే నూతన షెడ్డును శుక్రవారం ప్రారంభించారు. డిప్యూటీ కమిషనర్ శ్రీరామ వరప్రసాదరావు, దాత నారాయణరావు దేవస్థాన ప్రధాన అర్చకులు బుద్ధు పవన్ కుమార్ శర్మచే పూజలు జరిపించి నూతన రథాన్ని షెడ్డులో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పర్యవేక్షకులు అచ్యుత మధుసూదన రావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్సీపీ ఆవిర్భావంతో దేశ రాజకీయాల్లోనే మార్పు



- జగనన్న వెంటే జనమంతా..
- ఆయన చూపిన దారిలోనే మేమంతా..
- ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు, తూర్పు ఇంచార్జ్ దేవినేని అవినాష్



**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** వైఎస్సార్సీపీ ఆవిర్భావంతో దేశ రాజకీయాల్లోనే మార్పువచ్చిందని ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు, తూర్పు నియోజకవర్గం ఇంచార్జ్ దేవినేని అవినాష్ అన్నారు. వైఎస్సార్ సీపీ 16 వ ఆవిర్భావ దినోత్సవము సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి ఆధ్వర్యంలో 22వ డివిజన్ పరిధిలోని కోత మిషన్ బజార్‌లో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు, తూర్పు నియోజకవర్గం ఇంచార్జ్ దేవినేని అవినాష్‌చే జెండా కార్యక్రమం చేయడం, కేక్ కటింగ్ పండ్లు పంచారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న వెంటే జనమంతా ఉన్నారని, ఆయన చూపిన దారిలోనే ప్రతి ఒక్క పార్టీ నాయకులు, కార్యకర్తలు నడుస్తామని అన్నారు. '2011 మార్చి 12న పార్టీ ఆవిర్భవించింది. వైఎస్సార్సీపీ ఆవిర్భావంతో దేశ రాజకీయాల్లోనే మార్పు కనిపించిందన్నారు. తాడేపల్లి పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన వేడుకలలో జగన్న మాటలు ఎంతో ఆనందాన్ని కలించించాయని, వైఎస్సార్‌సీపీ అభిమాని కాలర్ ఎగరేసేలా పార్టీ ఉంటుందని ఆయన చెప్పడం కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందన్నారు.



### 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి ఆధ్వర్యంలో..



**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి వైఎస్సార్ సీపీ స్థాపించి 16వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా యన్.టి.ఆర్ జిల్లా అధ్యక్షులు, తూర్పు నియోజకవర్గం ఇన్చార్జి దేవినేని అవినాష్ సూచనల మేరకు స్థానిక 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి ఆధ్వర్యంలో రాణిగారి తోటలోని ఆర్సీఎం స్కూల్ దగ్గర ఉన్న స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కటింగ్ చేసి అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. పార్టీ బలోపేతంనుకు కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు, ప్రజా ప్రతినిధులకు ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలియ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### ఘనంగా 58వ డివిజన్‌లో వైసీపీ ఆవిర్భావ దినోత్సవం



**విజయవాడ, మేజర్ న్యూస్ :** 58వ డివిజన్ కృష్ణాహోటల్ సెంటర్లో డీప్యూటీ మేయర్ అవుతు శైలజా శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ 16వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ పార్టీ పేదల పార్టీ అని, గత రెండు సంవత్సరాల నుండి ప్రజలకు జగనన్న ప్రభుత్వం లేని లోటు స్పష్టంగా కనిపిస్తుంది అని మాయమాటలు నమ్మి మోసపోయామని బాధపడుతున్నారు అని అన్నారు.

### నేడు వివి ఫార్మసీ కళాశాల వార్షికోత్సవ వేడుక

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరులోని వి.వి.ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా మచిలీపట్నం కృష్ణా యూనివర్సిటీ రెక్టర్ డాక్టర్ ఎం.వి.బసవేశ్వరావు హాజరై వార్షికోత్సవ ప్రధానోపన్యాసం చేయనున్నారన్నారు. విద్యా, క్రీడా, సహపాఠ్య కార్యక్రమాల్లో విజయాలు సాధించిన విద్యార్థులకు అవార్డులు, బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా గురువారం కళా, సాంస్కృతిక, క్రీడా, సాహిత్య పోటీలు నిర్వహించామని, ఈ పోటీల ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, ప్రతిభను వెలికితీయడం ప్రధాన లక్ష్యంగా ఏర్పాటు చేశామని ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాల వార్షికోత్సవ వేడుకలకు విద్యార్థులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, శ్రేయోభిలాషులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కళాశాల యాజమాన్యం కోరింది.

# మంత్రి కొల్లు రవీంద్ర దంపతులచే రాజగోపుర శిఖర ప్రతిష్ట





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం బందరు కోటలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయం లో నూతనంగా నిర్మించిన శిలా రాజగోపురం శిఖర ప్రతిష్ట మహోత్సవాన్ని మంత్రి కొల్లు రవీంద్ర ఆయన సతీమణి నీలిమ దంపతులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ప్రజలందరూ సుఖశాంతులతో, సుభిక్షంగా జీవించాలని లోక కళ్యాణార్థం రాజగోపుర శిఖర ప్రతిష్ట మహోత్సవాన్ని నిర్వహించామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఈ మహోత్సవానికి అయోధ్య రామ మందిరానికి చెందిన మహంత్ రాజ్ నాథ్ స్వామి కాకినాడ శ్రీపీఠ స్వామీజీ పరిపూర్ణ సరస్వతి స్వామి, గుడివాడ శ్రీ ప్రణవాశ్రమం బూ విద్యాపీఠ స్వామీజీ సైరా ఆనంద సరస్వతి స్వామి తదితర పీఠాధిపతులు, ఆధ్యాత్మిక ప్రముఖులు రాజకీయ నాయకులు, భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా సాగింది.

# మరువలేని మహా మనిషి కేఎన్ఆర్

- ప్రముఖ హైకోర్టు అడ్వకేట్ సి. శ్రీనివాస్ బాబా
- ఘనంగా మాజీ జడ్పీ చైర్మన్ కేఎన్ఆర్ 70వ జయంతోత్సవం



**విజయవాడ, మార్చి 12 మేజర్ న్యూస్ :** బీసీ వర్గాలకు మరువలేని మహా మనిషి కృష్ణాజిల్లా మాజీ జడ్పీ చైర్మన్ దివంగత కుక్కల నాగేశ్వరరావు అని ప్రముఖ హైకోర్టు న్యాయవాది, తిరుపతి తిరుమల దేవస్థాన స్టాండింగ్ కౌన్సిల్ సి శ్రీనివాస్ బాబా పేర్కొన్నారు.కృష్ణాజిల్లా మాజీ చైర్మన్ దివంగత డా. కుక్కల నాగేశ్వరరావు 70 వ జయంతోత్సవ సందర్భంగా హైకోర్టు మాజీ ఏజీపీ డొక్కు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ అట్టడుగు స్థాయి నుంచి స్వయంకృషితో అత్యున్నత స్థాయికి ఎదిగిన కె. ఎన్.ఆర్. ఎంతోమంది యువతి, యువకులకు ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. చిరుద్యోగి గా విశాఖపట్నం వెళ్ళిన ఆయన వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే "ఎస్కే షిప్పింగ్ సంస్థ"ను స్థాపించారన్నారు. తాను ఎదగడమే కాక స్వయంకృషితో ఎదిగే అనేక మందికి ఆర్థిక, అంగ బలం, తోడ్పాటు అందించిన అద్వితీయ వ్యక్తిత్వం కె.ఎన్.ఆర్. దే అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్ మాట్లాడుతూ అట్టడుగు స్థాయి నుంచి అత్యున్నత స్థాయికి వ్యాపారంలో ఎదిగిన తన కులాన్ని మర్చిపోకుండా బీసీ, యాదవ సంఘ కార్యక్రమాలకు కేంద్ర బిందువుగా నిలిచారని పేర్కొన్నారు. కృష్ణాజిల్లా నుంచి విశాఖకు ఎవరు వెళ్లినా వెంటనే ఆదరించి తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన మహనీయుడు కేఎన్ఆర్ అని పేర్కొన్నారు. ఒంగోలు గిత్తల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ కన పరిచే కేఎన్ఆర్ "ఉత్తమ గో సంరక్ష అవార్డు" అందుకున్నారన్నారనీ ఘన నివాళులు అర్పించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్మన్ గా అద్వితీయంగా పనిచేసిన కేఎన్ఆర్ దేశంలోనే కృష్ణా జిల్లాలో అభివృద్ధిలో విఅగ్రగామిగా నిలిపారని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోరిపర్తి సాంబశివ రావు, తేజా రఘునాథ్ బాబు, సాయి రవి తేజా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999